క్లుప్తంగా

నేడు భీమేశ్వరునికి ప్రత్యేక పూజలు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఈఓ డి.నాగమల్లేశ్వరరావు తెలిపారు. స్వామివారి జన్మ నక్షత్రమైన ఆరుద్ర కావడంతో తెల్లవారు జామున అభిషేకాలు, పిఠాపురం మహారాజా గోత్రనామాలతో పూజలు ఉంటాయన్నారు. అమ్మవారికి కుంకుమార్చనలతో పాటు ఆలయంలోని ఉప ఆలయాల్లో పూజలు జరుగుతాయన్నారు. భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు.

వసతుల కల్పనకు కృషి


సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం: పట్టణంలో అన్ని కాలనీల్లోను మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే పెండెం దొరబాబు తెలిపారు. ఆయన గురువారం 8వ వార్డు సచివాలయ పరిధి డ్రైవర్స్ కాలనీలో రూ.7 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పట్టణ అభివృద్ధికి సీఎం జగన్ రూ.20 కోట్లు మంజూరు చేశారని, వాటితో మున్సిపాలిటీ అన్ని వార్డుల్లో ఆధునికీకరణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పలువురు వైఎస్సార్ సీపీ నేతలు, అధికారులు పాల్గొన్నారు.

చురుగ్గా అభివృద్ధి పనులు


సీసీ డ్రైన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ వీరబాబు

కొత్తపల్లి: మండలంలోని గోర్స ఎస్సీ పేటలో గురువారం సీసీ డ్రైన్ అవుట్‌లెట్ నిర్మాణాన్ని సర్పంచ్ రొంగల వీరబాబు ప్రారంభించారు. జెడ్పీ నిధులు రూ.2 లక్షలతో ఈ పనులను ప్రారంభించినట్లు తెలిపారు. గ్రామంలో పూర్తయిన ఆర్బీకే, జల్ జీవన్ మిషన్ పైపులైన్లు, ఓవర్‌హెడ్ ట్యాంకులను త్వరలోనే ఎమ్మెల్యే దొరబాబు ప్రారంభిస్తారని అన్నారు. మండల పరిషత్, పంచాయతీ నిధుల నుంచి ఇప్పటికే అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు.

పోస్టల్ పొదుపు వడ్డీ రేట్లు పెంపు

సామర్లకోట: దేశ వ్యాప్తంగా పోస్టల్‌లో పొదుపు చేసుకున్న ఖాతాదారులకు వడ్డీ రేట్లు పెంచారని సామర్లకోట హెడ్ పోస్ట్‌మాస్టర్ పి.రామ వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. పోస్టల్ సేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. జనవరి ఒకటి నుంచి పెంపు అమలులోకి వస్తుందన్నారు.

యథేచ్ఛగా కాలువల ఆక్రమణ


ఆక్రమణకు గురైన ప్రధాన పంటకాలువ

కొత్తపల్లి: పంట కాలువలను ఆక్రమిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉప్పాడలోని ప్రధాన కాలువలు ఆక్రమణలకు గురై లే అవుట్లలో కలసిపోతున్నా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. ఎటువంటి తూరలను ఏర్పాటు చేయకుండా ఇళ్లకు రోడ్లు నిర్మిస్తున్నారు. తుపాన్ల సమయంలో హడావిడి చేసే రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఈ ఆక్రమణలను పట్టించుకోవడం లేదు. కొత్తపల్లి నుంచి ఉప్పాడ మీదుగా సముద్రంలోకి వెళ్లే ప్రధాన కాలువ సైతం పూర్తిగా ఆక్రమణకు గురైంది. తుపాన్ల సమయంలో ముంపునీరు వెళ్లేందుకు కూడా వీలులేని పరిస్థితి ఏర్పడుతోందని పలువురు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

రోటరీ సెంట్రల్ క్లబ్‌కు రూ. 25 లక్షల విరాళం


రోటరీ సెంట్రల్ క్లబ్ సభ్యులకు విరాళం అందిస్తున్న శివరావు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): రోటరీ క్లబ్ కాకినాడ సెంట్రల్ చేపట్టే శాశ్వత ప్రాజెక్టుల కోసం నగరానికి చెందిన గాది శివరావు ఆయన భార్య సీతామహాలక్ష్మి జ్ఞాపకార్థం రూ. 25 లక్షల చెక్కును గురువారం క్లబ్ సభ్యులకు అందించారు. క్లబ్ శాశ్వత ప్రాజెక్టులైన బ్లడ్ బ్యాంకు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఉమెన్ ఎంపవర్‌మెంట్, ఫిజియోథెరపీ సెంటర్ల నిర్మాణం కోసం ఈ విరాళం అందించారు. శివరావును క్లబ్ అధ్యక్షుడు సామా భాస్కర్, ప్రాజెక్టు చైర్మన్ బోడా ఆనంద్‌కుమార్, క్లబ్ ఫౌండర్ మెంబర్ వాకచర్ల సూర్యం ఆధ్వర్యంలో సత్కరించారు.

అర్హతే కొలమానంగా పథకాల అమలు

- హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు
- లబ్ధిదారులకు కొత్త పింఛన్ల పంపిణీ


పెద్దాపురంలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న దొరబాబు

సామర్లకోట: అర్హతే కొలమానంగా ప్రభుత్వ పథకాలను అమలు చేస్తున్నామని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మండలంలో కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీ కార్యక్రమం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ల సొమ్మును పెంచారన్నారు. హామీలన్నీ అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. పేదల కోసం నవరత్నాలు ప్రకటించి వాటిని కచ్చితంగా అమలు చేస్తున్నారని అన్నారు. లబ్ధిదారుల చెంతకే పింఛన్లు అందజేయాలని సంకల్పంతో వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. మండలానికి కొత్తగా 404 పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. దీంతో పింఛనుదారుల సంఖ్య 11,735కు చేరిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు మాట్లాడుతూ దవులూరి దొరబాబును ఎమ్మెల్యేగా గెలిపించుకుని నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దామని పిలుపునిచ్చారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఎలిశెట్టి అమృత, వైస్ ఎంపీపీ ములసా శ్రీను, ఇన్‌చార్జి ఎంపీడీఓ వీవీ సాయిబాబు, తహసీల్దార్ ఎస్ఎల్ఎస్ కుమారి, సొసైటీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, వీరంరెడ్డి నానీ, మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం, నాయకులు ఎలిశెట్టి నరేష్ పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో దేశానికే ఆదర్శం

పెద్దాపురం: పింఛన్ల పంపిణీలో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. పెద్దాపురం అర్బన్‌కు సంబంధించి స్థానిక అంబేడ్కర్ భవన్, రూరల్ మండలానికి సంబంధించి కాండ్రకోటలో కొత్త పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ పార్టీల రహితంగా పింఛన్లు అందజేస్తున్న ఘనత ఏపీ ప్రభుత్వానిదేనన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ఒకటో తేదీ వేకువ జామునే ఇంటికెళ్లి మరీ పింఛన్లు అందజేస్తున్నారన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్‌లు నెక్కంటి సాయిప్రసాద్, కనకాల మహాలక్ష్మి, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీరరాఘవరావు మాట్లాడుతూ ఏటా పింఛన్ల సొమ్ము పెంచుతున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అనంతరం కొత్త పింఛన్లను పంపిణీ చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ వల్లూరి జ్యోతి, వైస్ చైర్మన్ బండారు వీరబాబు, మండల యూత్ అధ్యక్షుడు గోపు మురళి, వ్యవసాయ సలహా మండలి సభ్యుడు యినకొండ వీరవిష్ణుచక్రం, ఏలేటి అనంతలక్ష్మి, సర్పంచులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం


లబ్ధిదారులకు మోపెడ్‌లు అందజేస్తున్న దవులూరి దొరబాబు

పెద్దాపురం: రాష్ట్రంలో మత్స్యకారులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజనలో భాగంగా జె.తిమ్మాపురం, ఆర్‌బీ పట్నం గ్రామాలకు చెందిన నలుగురు లబ్ధిదారులకు టీవీఎస్ మోపెడ్, ఐస్ బాక్సులు, హెల్మెట్ కిట్లను ఆయన అందజేశారు. పెద్దాపురం ఇన్‌చార్జి మత్స్యశాఖ సహాయ తనిఖీ అధికారి కె.ప్రకాశరావు అధ్యక్షతన జరిగిన సభలో దొరబాబు మాట్లాడారు. మత్స్యకార రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఈ రంగంపై ఆధారపడిన ప్రతి కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం రాయితీలు అందిస్తుందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం 50 శాతం రాయితీపై మంజూరైన సుమారు రూ.3 లక్షల యూనిట్ కలిగిన మోపెడ్, ఐస్ బాక్సులను దొరబాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, ఏఎంసీ చైర్మన్ వల్లూరి జ్యోతి, వైస్ చైర్మన్ బండారు వీరబాబు, సర్పంచ్ శ్రీనివాస్, ఉప సర్పంచ్ జోకా నానాజీ, వ్యవసాయ శాఖ ఏడీఏ దైవకుమార్, మత్స్య శాఖ సహాయ సంచాలకుడు కె.కరుణాకరరావు, సహాయకులు చాగంటి పరశురాం, కె.పద్మ, వి.వేణు తదితరులు పాల్గొన్నారు.

పొలాలకు నీరు అందించాలి

సామర్లకోట: పవరలోని రాజు చెరువు నుంచి పొలాలకు సాగునీరు అందడం లేదని ఆ గ్రామ రైతులు తెలిపారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ చెరువు ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణలో ఉండటంతో చేపల పెంపకానికి లీజుకు ఇచ్చారన్నారు. దీనిద్వారా 950 ఎకరాల సాగునీరు అందాల్సి ఉందన్నారు. చెరువులో చనిపోయిన జంతు వ్యర్థాలు వేయడంతో ప్రజలు రోగాలకు గురవుతున్నారని ఎంపీటీసీ సభ్యుడు నాగనబోయిన చంటిబాబు, రైతులు నాగనబోయిన రాజబాబు, వీరంరెడ్డి ఆనంద్ తెలిపారు. చెరువుకు ఉన్న ఆరు తూరలను మూసివేయడంతో నీరు అందడం లేదన్నారు. దీనిపై ఇరిగేషన్ అధికారులకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు.

ప్రభుత్వం తరఫున న్యాయం చేయండి

ఎంపీ మోపిదేవికి మత్స్యకారుల వినతి


ఎంపీ మోపిదేవికి వినతిపత్రం అందజేస్తున్న మత్స్యకార నాయకులు

కొత్తపల్లి: తీరప్రాంత మత్స్యకార కుటుంబాలను ప్రభుత్వం తరఫున అన్ని విధాలా న్యాయం చేయాలని కోరుతూ స్థానిక మత్స్యకార నాయకులు ఎంపీ మోపిదేవి వెంకటరమణను ఉండవల్లిలో గురువారం కలసి వినతిపత్రం అందజేశారు. తొండంగి మండలం పెరుమాళ్లపురంలో నిర్మిస్తున్న బల్క్‌డ్రగ్స్ ఫార్మాకు సంబంధించి మత్స్యకార కుటుంబాలకు ఏ విధంగా న్యాయం చేస్తున్నారో అదే విధంగా కొత్తపల్లి మండలంలో ఉన్న ఉప్పాడ, అమీనాబాదు, మూలపేట, కోనపాపపేట తీరప్రాంతంలో ఉన్న మత్స్యకారులకు న్యాయం చేయాలని మత్స్యకార నాయకుడు, మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆయనకు వినతిపత్రం అందజేశారు. న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చినట్లు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో మత్స్యకార నాయకులు ఉమ్మిడి జాన్, కంబాల లక్ష్మణ్, అమీనాబాదు సర్పంచ్ నక్కా మణికంఠబాబు, సూరాడ రాజు తదితరులు ఉన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ

కొత్తపల్లి: కొత్తగా మంజూరైన పింఛన్లను మండలంలోని పలు గ్రామాల్లో గురువారం సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలసి సచివాలయ కన్వీనర్లు పంపిణీ చేశారు. పెంచిన రూ.2,750 అందించడంతో లబ్ధిదారులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. అమరవల్లిలో సర్పంచి పులి జయబాబు, సచివాలయ కన్వీనర్ గొరిసే కాపురెడ్డి కొత్త పింఛన్లు పంపిణీ చేశారు.


అమరవల్లిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

సొమ్ము కోసం తప్పని నిరీక్షణ


సామర్లకోట డీసీసీబీ బ్యాంకు వద్ద బారులు తీరిన రైతులు

సామర్లకోట: పీబీ దేవం, జి.మేడపాడు, ఉండూరు, సామర్లకోట, అచ్చంపేట, వీకే రాయపురం గ్రామాల్లో ప్రాథమిక సహకార సంఘాలు ఉన్నాయి. రైతులకు చేరువగా ఉండటంతో రైతులు ఆయా బ్యాంకుల్లో ఖాతాలు కలిగి ఉన్నారు. ఇటీవల ధాన్యం విక్రయం సొమ్ము ప్రభుత్వం నుంచి డీసీసీబీ బ్యాంకు ఖాతాలలోనే జమ అయ్యాయి. దాంతో ఆయా గ్రామాలలోని రైతులు సామర్లకోటలోని డీసీసీబీ బ్యాంకుకు వచ్చి సొమ్ము డ్రా చేసుకుందామంటే ఇవ్వడం లేదని రైతులు అంటున్నారు. ధాన్యం అమ్మిన సొమ్ము బ్యాంకులో ఉన్నా ఇవ్వడానికి అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోతున్నారు. డీసీసీబీ బ్యాంకు సేవలు సక్రమంగా లేకపోవడంతో తమ గ్రామాల్లో ఉన్న బ్యాంకులకు ఖాతాలను బదిలీ చేయాలని కోరినా పట్టించుకోవడం లేదని అంటున్నారు. ఇటీవల ధాన్యం విక్రయించిన సొమ్ము డీసీసీబీ బ్యాంకు ఖాతాలో జమ అయ్యిందని, బ్యాంకు నుంచి సొమ్ము తీసుకోవడానికి వెళితే ఇవ్వడం లేదని వీకే రాయపురం రైతు గొల్లపల్లి నానాజీ అన్నారు.

తగినంత సొమ్ము లేక..

వివిధ గ్రామాలకు చెందిన రైతులంతా ఒకేసారి బ్యాంకుకు రావడంతో సొమ్ము ఇవ్వలేకపోయాం. బ్యాంకు సామర్థ్యం మేరకే నగదు నిల్వ ఉంటుంది. రైతులకు కావాల్సిన స్థాయిలో నగదు ఉంచే విధంగా ఏర్పాటు చేస్తాం. – రమణ, డీసీసీబీ అసిస్టెంట్ మేనేజర్, సామర్లకోట

ఆహార ఉత్పత్తుల తయారీతో ఉపాధి

కాకినాడ రూరల్: ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార ఉత్పత్తి తయారీ సంస్థల క్రమబద్ధీకరణ పథకం (పీఎం– ఎఫ్ఎంఈ) కింద ఆహార ఉత్పత్తి తయారీ పరిశ్రమలను నెలకొల్పి ఉపాధి పొందవచ్చని డీఆర్‌డీఏ వైఎస్సార్ క్రాంతి పథం ప్రాజెక్టు డైరెక్టర్ కె.శ్రీరమణి పేర్కొన్నారు. రమణయ్యపేటలోని రూరల్ మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో పీఎం– ఎఫ్ఎంఈ పథకంపై లబ్ధిదారులతో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. విజయవాడ నుంచి వచ్చిన సెర్ప్ అడిషనల్ డైరెక్టర్ సరళ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా 10 శాతం పెట్టుబడి, 90 శాతం బ్యాంకు ద్వారా రుణ సదుపాయం పొందవచ్చన్నారు. రుణంలో 35 శాతం రాయితీ ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమానికి హాజరైన పండూరు గ్రామానికి చెందిన మహిళలకు వ్యాపార నైపుణ్యాలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ఫుడ్ ప్రాసెసింగ్ లైసెన్స్, ప్యాకేజింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్ వంటి సదుపాయాలపై ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ట్రైనర్ తాడిమళ్ల చరణ్ సంజీవ్ అవగాహన కల్పించారు. డీపీఎం కేశవ్, ఏపీఎం వేదకుమారి, సీసీలు శ్రీధర్, సురేష్, అనురాధ తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న డీఆర్‌డీఏ వైఎస్సార్ క్రాంతి పథం పీడీ శ్రీరమణ, సరళ

సేవే లక్ష్యంగా ముందుకు..

బాలాజీచెరువు: సేవ చేయడమే రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థుల చారిటబుల్ ట్రస్ట్ (1978) లక్ష్యమని ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ బాదం బాలకృష్ణ అన్నారు. స్థానిక దేవాలయం వీధిలోని ట్రస్ట్ కార్యాలయంలో ఎంబీబీఎస్ తృతీయ సంవత్సర విద్యార్థి ఎం.అకాష్‌కు రూ.లక్ష, డిగ్రీ ప్రథమ సంవత్సర విద్యార్థి ఎస్.ఆదిత్యరామ్‌కు రూ.15 వేలు అందజేశారు. అలాగే స్వయం ఉపాధిలో భాగంగా హోటల్ నిర్వహణ నిమిత్తం ఎం.పార్వతికి వంట సామగ్రి, గ్యాస్ స్టౌ పంపిణీ చేశారు.

బలవంతపు వసూళ్లకు పాల్పడితే చర్యలు

కాకినాడ రూరల్: రమణయ్యపేటలోని చేంజెస్ వలంటీర్స్ ఆర్గనైజేషన్ ప్రాంగణంలో హిజ్రాలకు గురువారం పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. సర్పవరం సీఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కాకినాడ డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కొంత మంది హిజ్రాలు రహదారులపై వెళ్లే వాహనదారులను ఆపి వారి నుంచి బలవంతంగా వసూళ్లకు పాల్పడం, అసాంఘిక కార్యకలాపాలు చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. ఇటువంటివి మానుకోకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఐ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే రుణాల ద్వారా సొంతంగా ఉపాధి పొందాలన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు


పీబీ దేవంలో పథకాల గురించి వివరిస్తున్న దవులూరి దొరబాబు

సామర్లకోట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఇంటికీ నేరుగా సంక్షేమ పథకాలు అందిస్తుందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. గురువారం పీబీ దేవం గ్రామంలో ఎంపీటీసీ సభ్యులు మలకల సూరిబాబు, వైవీబీ ప్రసాదరావు, సొసైటీ అధ్యక్షుడు మలకల వరహాలబాబుతో కలసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ గడప గడపకూ కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించే విధంగా అధికారులను భాగస్వామ్యం చేస్తున్నామన్నారు. పేదల విద్య కోసం అమ్మఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలను సీఎం జగన్ అమలు చేస్తున్నారని తెలిపారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారులకు పథకాలు అందజేస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మరోసారి మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, సర్పంచ్ నీలపాల సత్యనారాయణ, వీకే రాయపురం ఉప సర్పంచ్ యవర్న చంద్రశేఖర్, సచివాలయ కార్యదర్శులు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పిఠాపురంలో గడప గడపకూ..


అవ్వతో ఆప్యాయంగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పథకాల అమలులో రాష్ట్ర ప్రభుత్వం దేశానికే గర్వ కారణంగా మారిందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. ఆయన గురువారం పిఠాపురం 8వ వార్డు సచివాలయ పరిధి డ్రైవర్స్ కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి వస్తున్న స్పందనతో ప్రతి పక్షాల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం చేయని విధంగా సీఎం జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేసి సీఎం అంటే ఇలా ఉండాలి అనిపించారన్నారు. వార్డు కౌన్సిలర్లు బోనాసుల శివ, తలిశెట్టి వెంకటేశ్వరరావు, మఠం లోవరాజు, బోను దేవ, లోవరాజు, పోసయ్య, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పచ్చిమళ్ల జ్యోతి, మాజీ చైర్‌పర్సన్ వర్ధినీడి సుజాత, వైఎస్సార్ సీపీ నేతలు మార్నీడి రంగబాబు, కొత్తపల్లి బుజ్జి, బాలిపిల్లి రాంబాబు, బొజ్జా దొరబాబు, రెడ్డెం జనార్ధనరావు, ఆగంటి ప్రభాకరరావు వార్డు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

శిఖర్జీని పర్యాటకం చేయొద్దు


పిఠాపురంలో ప్రదర్శన చేస్తున్న జైనులు

పిఠాపురం: జైనులు పవిత్ర పుణ్య క్షేత్రంగా భావించే జార్ఖండ్ రాష్ట్రంలోని శిఖర్జీ పుణ్య క్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా మార్చవద్దంటు జైనులు గురువారం ఆందోళన నిర్వహించారు. స్థానిక శ్రీశీతల్ నాథ్ జైన్ సంఘం ఆధ్వర్యంలో జైన్ దేవాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేసి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దారు పితాని త్రినాథరావుకు అందజేశారు.

జైనుల నిరసన ప్రదర్శన


ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న పెద్దాపురం జైనులు

పెద్దాపురం: జార్ఖండ్ రాష్ట్రంలోని సమ్మత్ శిఖర్జీ పర్వత శ్రేణుల్లో పుణ్యక్షేత్రంపై ఆ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా పెద్దాపురంలో జైనులు గురువారం నిరసన తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద ఆ రాష్ట్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా నినాదాలు చేసి ఆర్డీఓ జేఎస్ రామారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జైన్ సంఘం అధ్యక్షుడు దేవేంద్రకుమార్ జైన్ మాట్లాడుతూ పర్వత శిఖరాల్లో అణువణువు జైనులకు అత్యంత పవిత్రమైందన్నారు. అటువంటి జైనులకు విరుద్ధంగా ఆ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా మాంసం, మద్యం, జూదం వంటి వాటిని అంగీకరిస్తూ జైన్ మతస్తుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సుఖరాజ్ జైన్, రామేష్‌జైన్, చంపాలాల్ జైన్, ఆనంద్‌జైన్, కిషన్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట: తమ పుణ్యక్షేత్రాన్ని కాపాడాలని జైన్‌లు సామర్లకోటలో పాదయాత్ర నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేశారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారిలకు వినతి పత్రాలు సమర్పించారు. జార్ఖండ్ రాష్ట్రంలోని పర్వత శిఖరాలు జైన్‌లకు ఎంతో పవిత్రమైనవని, అటువంటి పవిత్ర ప్రదేశాలను అక్కడి ప్రభుత్వం పర్యాటక ప్రదేశంగా ప్రకటించడం దారుణమని స్థానిక జైన్ సంఘ అధ్యక్షుడు ఫార్మల్ జైన్ తెలిపారు.

పూర్తయిన కుట్టు శిక్షణ


సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థినులతో లయన్స్ క్లబ్ ప్రతినిధులు

సామర్లకోట: శ్రీభీమేశ్వరా– సామర్లకోట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ చదువుతున్న విద్యార్థినులకు నెల రోజుల పాటు కుట్టు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ పూర్తి కావడంతో గురువారం సాయంత్రం విద్యార్థినులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు ఎస్.సుధారాణి, మాజీ అధ్యక్షుడు కర్రి ఆదినారాయణరెడ్డి, మేకా శ్రీను, గుండు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్సై సునీత

సామర్లకోట: సంక్రాంతిని పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ సంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఐ కె.దుర్గాప్రసాద్ అన్నారు. కాకినాడ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సామర్లకోట పోలీసు స్టేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం సాయంత్రం బ్రౌన్‌పేటలో యువతకు కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై టి.సునీత పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన


నృత్యం చేస్తున్న మంజీర నాట్యాలయ విద్యార్థులు

కాకినాడ కల్చరల్: స్థానిక ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని సత్కళావాహిని భక్తిరస సంగీత సంస్థ ఆడిటోరియంలో సంస్థ 52వ వార్షికోత్సవ వేడుకలు, ధనుర్మాస ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి, సంగీత విద్వాంసుడు డాక్టర్ ఈవీ కృష్ణమాచార్యులు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. మంజీర నాట్యాలయ నాట్యాచార్యులు, విద్యార్థులు నృత్య రూపకాలను ప్రదర్శించారు. అనంతరం గాయత్రి గానలహరి బృందం సభ్యులు భక్తిగీతాలు ఆలపించారు. తదుపరి నాట్యాచార్యులు పి.దుర్గారావును సత్కళావాహిని సభ్యులు సత్కరించారు. నాట్య ప్రదర్శనలో పాల్గొన్న 16 మంది విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. దాతల సహకారంతో వేడుకలు నిర్వహిస్తున్నామని సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ ఈవీ కృష్ణమాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో కె.వెంకటేశ్వర్లు, తులసమ్మ, రామకృష్ణ, శారదాదేవి, శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు అష్టోత్తర శత ద్రవ్యాభిషేకం

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): స్థానిక దేవాలయం వీధిలోని బాలాత్రిపురసుందరీ సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం 8 గంటలకు అష్టోత్తర శత ద్రవ్యాభిషేకాలు జరుగనున్నాయి. ఈ పూజలు టీటీడీ వేద పండితుడు హోతా శివభాస్కరశర్మ ఆధ్వర్యంలో జరుగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ రాజనాల విజయసారథి గురువారం తెలిపారు. ఉదయం 8.15 చతుర్వేద పండితుల ఆధ్వర్యంలో శత ద్రవ్యాభిషేకం, పుణ్యాహవచనం, గోపూజ, మహాన్యాసం, మండపారాధన, కలశస్థాపన, 108 ద్రవ్యాల సంప్రోక్షణ, మధ్యాహ్నం మూడు గంటలకు 108 కలశాలతో కాకినాడ పురవీధుల్లో ఊరేగింపుగా బయలుదేరి జగన్నాథపురం విఘ్నేశ్వర ఘాట్ వద్దకు చేరుకొని కలశాలలోని నీటిని గంగలో కలుపుతామన్నారు. లోక కల్యాణార్థం ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.


పూజకు 108 కలశాలు సిద్ధం చేస్తున్న సిబ్బంది